సాక్షి
పార్వతీపురం మన్యం

బుధవారం । 2 । ఏప్రిల్ । 2025



కానిస్టేబుల్‌నని చెప్పి.. సైబర్ మోసం..! - 8లో

కానిస్టేబుల్‌నంటూ డబ్బులు కాజేసిన ఘటన వీరఘట్టంలో చోటుచేసుకుంది.



ఉపాధి హామీ బకాయి బిల్లులు తక్షణమే చెల్లించాలి - 8లో

ఉపాధి వేతన దారులకు బకాయి బిల్లులు చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అప్పారావు డిమాండ్ చేశారు.



అంగరంగ వైభవంగా పోలమాంబ చండీహోమం - 8లో

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి 10వ జాతర ముగిసింది.

న్యూస్‌రీల్

కేంద్రీయ విద్యాలయంలో ఖాళీ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో వివిధ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విద్యాలయ ప్రిన్సిపాల్ దిలీప్ మోడీ మంగళవారం తెలిపారు. 2వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 2 నుంచి 11వ తేదీ వరకు (ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు) దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. దరఖాస్తు ఫారాలను విద్యాలయం నుంచి, లేదంటే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పూర్తి సమాచారం, సీట్ల ఖాళీల వివరాల కోసం విద్యాలయ వెబ్‌సైట్ 'విజయనగరం.కేవీఎస్.ఎన్‌.ఐఎన్'ను సందర్శించవచ్చని వివరించారు.

విజయనగరంతో విడదీయలేని అనుబంధం

- పైడితల్లిని దర్శించుకున్న శైలజ దంపతులు
- అలరించిన స్వరసాగర సంగమం
- ఘనంగా గురునారాయణ కళాపీఠం నాలుగో వార్షికోత్సవం



పైడితల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న శైలజ, సుధాకర్ దంపతులు

విజయనగరం టౌన్: మహనీయులు నడయాడిన నేలపై తాము అడుగుపెట్టడం ఎంతో ఆనందంగా ఉందని, విజయనగరంతో తమకు విడదీయలేని అనుబంధం ఉందని మధురగాయని, చలన చిత్రనటులు ఎస్.పి.శైలజ, శుభలేఖ సుధాకర్ దంపతులు పేర్కొన్నారు. స్థానిక ఆనందగజపతి కళాక్షేత్రంలో మంగళవారం రాత్రి నిర్వహించిన గురునారాయణ కళాపీఠం నాల్గొవ వార్షికోత్సవ వేడుకలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాపీఠం వ్యవస్థాపకులు బి.ఎ.నారాయణ నేతృత్వంలో గాయనీ, గాయకులు పవన్ చరణ్, సంతోష్ కిరణ్, సురభిశ్రావణి, హారిక శివరామ్, ఆత్మీయ గాయని, సినీనటి పడాల కళ్యాణిలు సినీ, భక్తి గీతాలు అలపించి ఆహుతుల కరతాళధ్వనులందుకున్నారు. ఎస్పీ శైలజ మయూరి చిత్రంలోని పాటను అలంపి శ్రోతలను అలరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ జి.సన్యాసమ్మ, గౌరవాధ్యక్షులు దోల మన్మథకుమార్, గౌరవ కార్యదర్శి నడిపేన శ్రీనివాసరావు, కోశాధికారి బి.పద్మావతి, యార్లగడ్డ బాబూరావు, గుడిశ శివ కుమార్, ఉప్పుప్రకాష్, ఇమంది రామారావు, వైవీవీ సత్యనారాయణ, అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

పైడితల్లి సేవలో శైలజ దంపతులు

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారిని శైలజ, సుధాకర్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ ఇన్‌చార్జి ఈఓ కేఎన్‌వీడీ ప్రసాద్ నేతృత్వంలో వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శైలజ దంపతులకు వేదాశీస్సులతో పాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.



వేదికపై పాటలు ఆలపిస్తున్న ఎస్పీ శైలజ

ఫలితాలు రాకుండానే..

ప్రవేశాలకు ఆరాటం!



- నూతన విద్యావిధానమంటూ ఇంటర్ విద్యలో సమూల మార్పులు
- ఏడో తేదీ నుంచి మొదటి సంవత్సరం ప్రవేశాలు
- పదో తరగతి పరీక్షలు పూర్తి కాకుండానే హడావిడి

సాక్షి, పార్వతీపురం మన్యం/పార్వతీపురంటౌన్: సాధారణంగా పదో తరగతి పరీక్షల ఫలితాలు వచ్చిన తర్వాతనే ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు జరుగుతాయి. ఫెయిల్/పాస్ తేలిన తర్వాత.. వచ్చిన మార్కుల ఆధారంగా ఇష్టమైన సబ్జెక్టులో సీటు దొరుకుతుంది. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల పుణ్యమానీ ప్రవేశాల్లో పోటీ పెరిగింది. ఫలితాలు రాకుండానే ఇంటర్మీడియట్‌లో విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. రేటు బట్టి సీటు కేటాయింపు జరుగుతోంది. ఇప్పుడు ఆ జాడ్యం ప్రభుత్వానికీ అంటుకున్నట్లు ఉంది. ఈ ఏడాది నూతన విద్యావిధానమంటూ ఇంటర్ విద్యలో సమూల మార్పులు తీసుకొచ్చారు. విద్యాసంవత్సరంలో మార్పులు చేశారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం తరగతులను ఏప్రిల్ 1 నుంచే ప్రారంభించేశారు. ఆ మేరకు జిల్లా వ్యాప్తంగా మంగళవారం నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి.

జిల్లాలో ఈ ఏడాది జనరల్, ఒకేషనల్, ప్రైవేట్ విద్యార్థులు కలిపి మొత్తం 9,335 మంది ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరయ్యారు. 10,363 మంది పదో తరగతి పరీక్షలు రాయగా.. వీరిలో ఎంతమంది ఉత్తీర్ణులవుతారో చూడాలి. పదో తరగతి రాసిన వారికి ఈ నెల 7 నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నారు. పది పరీక్షలు రాసిన విద్యార్థులందరికీ ఫలితాలతో సంబంధం లేకుండా హాల్ టికెట్ల ఆధారంగా అడ్మిషన్ కల్పిస్తారు. ఫలితాలు వెల్లడైన తర్వాత పాసైన వారిని కొనసాగించి, ఫెయిలైన వారిని తొలగిస్తారు. ఈ నిర్ణయంపై విద్యార్థి సంఘాల నుంచి విస్మయం వ్యక్తమవుతోంది. ఒకవేళ విద్యార్థులను తొలగిస్తే వారి మానసిక స్థితి మీద ఆ ప్రభావం పడుతుందని ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు ఇంటర్ పరీక్షల తర్వాత వేసవి సెలవులు, జూన్ 1 నుంచి కొత్త విద్యాసంవత్సరం ఆరంభమయ్యేది. నూతన విధానం ఫలితంగా ఏప్రిల్ 1 నుంచి విద్యాసంవత్సరం ప్రారంభించి, రెండో సంవత్సరం ఇంటర్మీడియట్ తరగతులను నిర్వహించనున్నారు. ఏప్రిల్ 24 నుంచి మరలా వేసవి సెలవులు ఇవ్వనున్నారు.

7 నుంచి మొదటి సంవత్సరం ప్రవేశాలు

ప్రవేశాల కోసం కళాశాలల సిబ్బందిపై ఒత్తిడి



పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు హాల్‌టికెట్‌తోనే ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశం పొందే వెసులుబాటు కల్పించడంతో ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులను చేర్చుకునేందుకు పోటీ పడుతున్నాయి. ఆయా కళాశాలల అధ్యాపకులు, సిబ్బంది ప్రవేశాల కోసం రోడ్డెక్కారు. ఆయా యాజమాన్యాలు కూడా సిబ్బందికి టార్గెట్లు ఇవ్వడంతో విద్యార్థుల తల్లిదండ్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో 52 వరకు ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలలు ఉండగా.. ఇక్కడి సిబ్బంది సైతం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరాలని పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రాధేయపడుతున్నారు. ఇంకా ఫలితాలు రాకుండానే విద్యార్థులను ఎలా, ఏ సబ్జెక్టులో చేర్చుతామని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

7 నుంచి ప్రవేశాలు కల్పిస్తున్నాం..



ప్రభుత్వం నిర్ణయం మేరకు మంగళవారం నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సర తరగతులు ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం ప్రవేశాలు ఈ నెల 7 నుంచి కల్పిస్తాం. టెన్త్ ఫలితాలతో సంబంధం లేకుండా హాల్ టికెట్ల ఆధారంగానే ప్రవేశాలు పొందవచ్చు. ఈ ఏడాది కూడా పదో తరగతి ఫలితాలు బాగుంటాయి. అందరూ ఉత్తీర్ణులవుతారనే నమ్మకం ఉంది. సిలబస్‌లోనూ మార్పులు ఉంటాయి. విద్యార్థులకు టెక్ట్స్, నోట్ పుస్తకాలు కూడా అందజేయనున్నాం.

– మంజులవీణ, జిల్లా ఇంటర్ విద్య అధికారిణి

16.12శాతం వృద్ధి సాధనే లక్ష్యం

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లాలో 16.12 శాతం వృద్ధి సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో జిల్లా ప్రగతిపై తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గతేడాది తలసరి ఆదాయం రూ.1,67,543లు కాగా, ఈ ఏడాది రూ.1,94,048లుగా అంచనా వేస్తూ వృద్ధి రేటు 16.12 శాతం సాధించేందుకు కృషిచేస్తున్నామన్నారు. జిల్లాలో 49.27 శాతం ప్రాథమిక రంగం (వ్యవసాయ, అనుబంధ రంగాలు), 9.09 శాతం పారిశ్రామిక, 41.64 శాతం సేవా రంగాల నుంచి వృద్ధి ఉండబోతుందన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో వృద్ధి సాధించేందుకు కృషిచేస్తున్నామన్నారు.

డ్వాక్రా స్త్రీనిధి, ఐటీడీఏ నిధుల నుంచి గొర్రెలు, పశువులు, కోళ్ల పెంపకం వంటి కార్యక్రమాలకు నిధులు కేటాయిస్తామన్నారు. ఉపాధిహామీ పథకం కింద 128.91 లక్షల పనిదినాలు సృష్టించబడ్డాయన్నారు. గతేడాది కంటే 5 లక్షల పనిదినాలు అధికంగా చేసినట్టు వెల్లడించారు. జిల్లాలో 280 ప్రధాన ట్యాంకులు ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేయడంతోపాటు ఆక్రమణలు తొలగింపుపై ప్రధానంగా దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా నీటియాజమాన్య సంస్థ పథక సంచాలకుడు కె.రామచంద్రరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

జిల్లాలో మంజూరు చేసిన వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం తక్షణమే పూర్తిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. గృహ నిర్మాణం, ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలు, ఇంజినీరింగ్ పనులు తదితర అంశాలపై మండల అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 7,134 మరుగుదొడ్లు పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. 4 వేల గృహాలను మూడు నెలల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. సాలూరు మున్సిపాలిటీలో 437 మందికి, పార్వతీపురం మున్సిపాలిటీలో 548 మందికి, పాలకొండలో 197 మందికి అదనపు సహాయం చేసినట్టు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు సూర్యఘర్ యూనిట్ల ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ శోభిక, జిల్లా రెవెన్యూ అధికారి హేమలత, కేఆర్‌ఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డా.ధర్మచంద్రారెడ్డి, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

ఫాంపాండ్స్‌తో భూగర్భ జలాల పెంపు

- జిల్లా ప్రత్యేక అధికారి నారాయణ భరత్ గుప్తా

కొమరాడ: ఉపాధిహామీ నిధులతో చేపట్టే ఫాం పాండ్స్‌తో భూగర్భ జలాలు పెరిగి సాగునీటి కొరత తీరుతుందని జిల్లా ప్రత్యేక అధికారి నారాయణ భరత్ గుప్తా తెలిపారు. కొమరాడ మండలం విక్రంపురం పంచాయతీ పరిధిలోని ఉపాధిహామీ పనులను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, డ్వామా పీడీతో కలిసి మంగళవారం పరిశీలించారు. పశువుల నీటి తొట్టెల నిర్మాణ పనులను ప్రారంభించారు. తమ్మన్నదొరవలస గ్రామంలో నిర్మించిన మినీ గోకులాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. నందాపురం గ్రామంలో నిర్మితమవుతున్న ఫారం పాండ్సను తనిఖీ చేశారు. ఏటా సాగు భూమిని సారవంతం చేసుకుంటూ బహుళ పంటల వైపు సాగితే అధిక లాభాలు వస్తాయన్నారు. చేపల పెంపకానికి ఫాంపాండ్లను వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు, స్థానిక నాయకులు కళింగి మల్లేశ్వరరావు, దేవకోటి వెంకటినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



నందాపురంలో తవ్వుతున్న ఫారం పాండ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి గుప్త, కలెక్టర్ శ్యామప్రసాద్

ఎరుకులపేటలో నారాయణమూర్తి సందడి



ఎరుకులపేట గ్రామస్తులతో సినీనటుడు నారాయణమూర్తి



రఘును కలిసిన నారాయణమూర్తి

గజపతినగరం రూరల్: సినీ హీరో, నిర్మాత, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి గజపతినగరం మండలం పాతబగ్గాం పంచాయతీ పరిధిలోని ఎరుకులపేటలో మంగళవారం సందడి చేశారు. గ్రామానికి చెందిన వర్ధమాన సినీనటుడు, రేలా రేరేలా గాయకుడు రఘు ఇంటికి వచ్చారు. త్వరలో తాను తీస్తున్న నూతన సినిమాలో రఘుతో పాట పాడించడంతో పాటు చిన్నపాటి పాత్రను పోషించడంపై చర్చించేందుకు వచ్చినట్టు నారాయణమూర్తి తెలిపారు. ఆయనను చూసేందుకు గ్రామంలోని మహిళలు, చిన్నారులు గుమిగూడారు. సెల్ఫీలు దిగారు. అందరూ బాగుండాలి అంటూ ఆయన గ్రామస్తులను దీవించి అక్కడ నుంచి బయలు దేరారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్ ఫేజ్ 2 పరీక్షలు

విజయనగరం అర్బన్: ప్రతిష్టాత్మక ఇంజినీరింగ్ ఐఐటీ కళాశాలల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్స్ ఫేజ్–2 పరీక్షలు బుధవారం నుంచి ఈ నెల 9వ తేదీ వరకు జిల్లాలో ప్రారంభం కానున్నాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా స్థానిక గాజులరేగ సమీపంలోని సీతం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలోని ఐయాన్ డిజిటల్ జోన్ ఐడీజే భవనంలో జరగనున్నవి. జిల్లా నుంచి మొత్తం 4,239 మంది ఈ పరీక్ష రాయనున్నారు. తొలి రోజు ఉదయం 459 మంది, మధ్యాహ్నం పూట 441 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని నిర్వాహకులు తెలిపారు.

ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత

- భారీ పోలీస్ బందోబస్తు నడుమ అప్పలాగ్రహారంలో ఆక్రమణల తొలగింపు

సంతకవిటి: మండలంలోని అప్పలాగ్రహారం గ్రామంలో ఆక్రమణల తొలగింపు ఉద్రిక్తతకు దారితీసింది. పోలీస్ బలగాల నడుమ మండలాధికారులు ఆక్రమణలను తొలగించారు. వివరాల్లోకి వెళ్తే... గ్రామంలోని కాలువ గట్టును అనుసరించి ఉన్న గ్రామకంఠంను అదే గ్రామానికి చెందిన పిన్నింటి లచ్చయ్య, కుటుంబ సభ్యులు ఆక్రమించారు. దీనిపై గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు తహసీల్దార్ సత్యం, ఎంపీడీఓ సురేష్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది ఆక్రమణల తొలగింపునకు మంగళవారం వచ్చారు. ఆక్రమణదారుకు ఇదివరకే పంపించిన నోటీసును చూపించారు. గడువు ముగిసినా ఆక్రమణలు తొలగించక పోవడంపై ప్రశ్నించారు. జేసీబీతో అధికారులే దగ్గరుండి ఆక్రమణలు తొలగించేందుకు సమాయత్తమయ్యారు. ఈ సమయంలో ఆక్రమణదారు, కుటుంబ సభ్యులు ఒక్కసారి అధికారులపై తిరగబడ్డారు. వెంటనే అధికారులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ ఆర్.గోపాలరావు, రేగిడి ఎస్‌ఐ పి.నీలావతి, పోలీస్ బలగాలు గ్రామానికి చేరుకున్నాయి. భారీపోలీస్ బందోబస్తు మధ్య ఆక్రమణలు తొలగించారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేసినట్టు ఎస్‌ఐ ఆర్.గోపాలరావు తెలిపారు.



జేసీబీ సహాయంతో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సంతకవిటి, రేగిడి ఎస్‌ఐలు

రెవెన్యూ సిబ్బంది అలసత్వంతోనే..

రెవెన్యూ సిబ్బంది అలసత్వంతోనే పరిస్థితి ఇంతవరకు వచ్చిందని గ్రామస్తులు పలువురు ఆరోపిస్తున్నారు. ఆక్రమణల ప్రారంభంలోనే ఫిర్యాదు చేసినా రెవెన్యూ సిబ్బంది స్పందించలేదని వాపోయారు. రెండు రోజుల కిందట జిల్లా స్థాయి అధికారులను ఆశ్రయించడంతో అధికారుల్లో చలనం వచ్చిందన్నారు.



రెంటికీ చెడిన..

రేవటిగూడ



అధికారులను కలిసేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన రేవటిగూడ గిరిజనులు

- అటు ఒడిశాలో కాక.. ఇటు ఆంధ్రాలో లేక..
- పార్వతీపురానికి సమీపంలో ఉన్న గిరిజన గ్రామం దుస్థితి
- ఆధార్, రేషన్‌కార్డులు లేక గ్రామస్తుల ఇక్కట్లు

సాక్షి, పార్వతీపురం మన్యం: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని కొటియా గ్రామాల మధ్య వివాదం కొన్ని దశాబ్దాలుగా సాగుతూ వస్తున్న విషయం విదితమే. ఆ గ్రామాలపై పట్టు సాధించేందుకు ఇరు రాష్ట్రాలూ ప్రయత్నాలు సాగిస్తున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే.. ఆంధ్ర రాష్ట్ర యంత్రాంగం కంటే.. ఒడిశా యంత్రాంగమే ఆ గ్రామాల విషయంలో దూకుడు మీద వెళ్తోంది. ఇరు రాష్ట్రాల నుంచి సంక్షేమ పథకాలను, ఆధార్, రేషన్‌కార్డులను కొటియా ప్రజలు పొందారు. ఒడిశా ప్రభుత్వం అక్కడ మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేసింది. దీనికి కారణం అక్కడ విలువైన మైనింగ్ నిక్షేపాలు ఉండడం వల్లేనని.. అందుకే ఒడిశా పట్టువీడటం లేదని సమీప గ్రామ ప్రజల ఆరోపణ.

ఇదే పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని రెండు రాష్ట్రాల సరిహద్దులో మరో గ్రామం ఉండిపోయింది. 45 సంవత్సరాలుగా అటు ఒడిశా పట్టించుకోక.. ఇటు ఆంధ్రా నుంచీ స్పందన లేక అక్కడి గిరిజన ప్రజలు నలిగిపోతున్నారు.

జిల్లాలోని సాలూరు నియోజకవర్గ పరిధి కొదమ నుంచి దాదాపు 40 గిరిజన కుటుంబాల వారు పోషణ కోసం సుమారు 45 ఏళ్ల కిందట పార్వతీపురం మండలం పెదమరికి పంచాయతీ సమీపంలోని రేవటిగూడ గిరిజన గ్రామానికి విచ్చేసి, స్థిరనివాసం ఏర్పరుచుకున్నారు. కొంత భూమిలో జీడి, మామిడి, వరి సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. పార్వతీపురం జిల్లా కేంద్రానికి ఈ ప్రాంతం దాదాపుగా పది కిలోమీటర్ల దూరంలో ఉంటే.. ఒడిశాలోని కొరాపుట్ జిల్లాకు కొన్ని వందల కిలోమీటర్ల దూరంలో ఉంది. గతంలో ఈ ప్రాంతంలో కొరాపుట్ జిల్లా పరిధిలోనిదే అని చెబుతూ నలుగురైదుగురికి అక్కడి ప్రభుత్వం ఆధార్, రేషన్‌కార్డులు, పింఛన్లు కూడా ఇచ్చింది. ఆ తర్వాత పట్టించుకోవడం మానేసింది. జంఝావతిలో నీరు పారితే.. అటు ఒడిశా వైపు వెళ్లడానికి పూర్తిగా రాకపోకలు స్తంభించిపోతాయి. తమను ఆంధ్రాలోనే ఉంచాలని ఇక్కడి గిరిజనులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. సాగు భూములకు హక్కు పత్రాలు ఇవ్వడంతో పాటు.. ఆధార్, రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇతర ప్రభుత్వ పథకాలు ఇవ్వాలని కోరుతున్నారు.

కనీస సదుపాయాలు లేవు..



మా ఊరు ఇటు ఆంధ్రాకు, అటు ఒడిశాకు చెందకుండా ఉంది. రెండు రాష్ట్ర ప్రభుత్వాలూ మమ్మల్ని పట్టించుకోవడం లేదు. కనీస సౌకర్యాలు లేవు. రేషన్ లేదు, పెన్షన్ రావడం లేదు. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పార్వతీపురం కలెక్టరేట్‌లో అధికారులను కలిసి సమస్య చెప్పుకొంటాం.

– మండంగి దేబురు, రేవటిగూడ

ఆంధ్రాలోనే ఉంచాలి..



మాది ఒడిశాలోని కొరాపుట్ జిల్లా అంటున్నారు. మాకు ఆ ప్రాంతం చాలా దూరం. ఆంధ్రాలోనే ఉంచాలని అడుగుతున్నాం. పార్వతీపురం మండలం పెదమరికి పంచాయతీలో మమ్మల్ని విలీనం చేయాలి. మా గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి. ఇప్పటికే పలు మార్లు అధికారులను కలిసి వేడుకున్నా ఫలితం ఉండటం లేదు.

– మండంగి బొండయ్య

ఆధార్‌కార్డు లేదు..



రెండు రాష్ట్రాలకూ చెందకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎవరూ మమ్మల్ని పట్టించుకోవడం లేదు. గ్రామంలో అభివృద్ధి పనులేవీ జరగడం లేదు. మా దగ్గర ఓట్లు లేవు కదా.. ఇంకెవరు పట్టించుకుంటారు. ఆంధ్రాలోనే ఉంచాలని అడుగుతున్నాం. రేషన్‌కార్డు, ఆధార్ కార్డు ఇప్పించాలి.

– ఆరిక రౌతు, రేవటిగూడ

క్లుప్తంగా

వంశధార నది దాటిన జంట ఏనుగులు



వంశధార నది గుండా తరలి వెళ్తున్న ఏనుగుల జంట

భామిని: మండలంలోని బిల్లుమడ రైతులు ఊపిరి పీల్చుకున్నారు. భామిని మండలం బిల్లుమడకు చేరిన జంట ఏనుగులు ఫీంకరిస్తూ మంగళవారం వంశధార నదిని దాటాయి. ఇప్పటికే ఒడిశా గ్రామాల్లో మరో రెండు ఏనుగుల జట్టు వీడిన రెండు ఏనుగుల జంట కోసం పాకులాడుతున్నట్లు తెలిసింది. వంశధార నదీ తీరంలోని ఒడిశాకు చెందిన పురిటిగూడ–గౌరీ గ్రామాల మధ్య రెండు ఏనుగుల జంటలు కలిసి ఊరట చెందాయని స్థానిక రైతులు తెలిపారు.

రజక సంఘం పట్టణ నూతన కమిటీ ఎంపిక



నూతన కమిటీ ఎంపిక పత్రాన్ని అధ్యక్షుడికి అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

విజయనగరం టౌన్: ఉమ్మడి విజయనగరం, జిల్లా రజక సంఘం ఆధ్వర్యంలో విజయనగరం పట్టణ నూతన కమిటీ ఎంపిక మంగళవారం కార్యాలయంలో నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడిగా కోనాడ పైడిచిట్టి, ఉపాధ్యక్షుడిగా రామనేంద్రపు సురేష్, కార్యదర్శిగా కొవ్వూరి అప్పలరాజు, సహాయ కార్యదర్శిగా ముత్యాల సతీష్, కోశాధికారిగా జంపా నాగరాజు, కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో అప్పికొండ సన్యాసిరావు, తంగేటి భాస్కరరావు, జంపా చిన్న, మడిపల్లి రాజారావు, సురేష్, శంకర్, రాజా, సురేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

100 సారా ప్యాకెట్లు స్వాధీనం

పార్వతీపురం రూరల్: పట్టణ పోలీసులు తనిఖీల్లో భాగంగా పట్టణంలో గల పాత రెల్లివీధిలో వంద సారా ప్యాకెట్లతో మీసాల శివకుమార్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు టౌన్ ఎస్సై గోవింద మంగళవారం తెలిపారు.


విద్యుత్ షాక్‌తో వలస కార్మికుడి మృతి



రాహుల్ (ఫైల్)

సీతంపేట: మండలంలోని కిల్లాడ గ్రామానికి చెందిన వూయక రాహుల్ (20) అనే గిరిజన యువకుడు వలస వెళ్లి అక్కడ విద్యుత్ షాక్‌తో రెండు రోజుల క్రితం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపారు. ఈ ప్రాంతంలో ఉపాధి లేక పొట్ట చేతబట్టుకుని కొద్ది నెలల కిందట మచిలీపట్నం వలసవెళ్లాడు. అక్కడ చేపల చెరువుకు కాపలాగా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగానే గతనెల 31న చేపలచెరువుకు వెళ్లి పనిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మరణించాడు. కుమారుడి మృతివార్త విన్న తల్లిదండ్రులు తిరుపతిరావు,నీలమ్మలు గుండెలవిసేలా రోదించారు. స్వగ్రామం కిల్లాడలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు.

వడదెబ్బతో వృద్ధురాలు..



గౌరమ్మ మృతదేహం

వీరఘట్టం: స్థానిక మేజర్ పంచాయతీలోని ముచ్చర్లవీధికి చెందిన మంతిన గౌరమ్మ(85) వడదెబ్బతో మృతి చెందినట్లు వీధివాసులు తెలిపారు. వారం రోజులుగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతోనే వృద్ధురాలు మృతి చెందిందని స్థానికులు అంటున్నారు. మంగళవారం ఉదయం పింఛన్ తీసుకున్న తర్వాత కొద్ది సేపటికే మృతి చెందినట్లు స్థానికులు చెప్పారు. ఆమెకు కుటుంబసభ్యులు, బంధువులు ఎవరూ లేకపోవడంతో వీధిలో ఉన్నవారే ఆమెకు అంత్యక్రియలు నిర్వహించారు.

యువతకు స్ఫూర్తి భగత్‌సింగ్



మాట్లాడుతున్న నవ యువ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు అప్పలరాజు

విజయనగరం గంట స్తంభం: పాలకుల విధానాలపై, సామ్రాజ్యవాద దోపిడి పీడలకు వ్యతిరేకంగా పోరాడిన వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ అని ఎన్‌వైఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం.అప్పలరాజు అన్నారు. మంగళవారం నవయువ సమాఖ్య ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల దురగతాలను వ్యతిరేకిస్తూ స్వయం పాలన సాధించాలని తిరుగుబాటు జెండాను ఎగరవేసి స్వాతంత్ర పోరాటంలో యువకులకు ఉరి తొలగించిన వ్యక్తి భగత్ సింగ్ అని గుర్తు చేశారు. సోషలిస్టు వ్యవస్థ లేని దోపిడి రహిత సమాజం ఏర్పడుతుందని నినదించిన వ్యక్తి భగత్ సింగ్ అని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కరరావు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌నని చెప్పి.. సైబర్ మోసం..!



- రూ.28 వేలు ఫోన్‌పే చేసిన బాధితుడు
- లబోదిబోమంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



పోలీసులు ఆరా తీయగా వచ్చిన సైబర్ కేటుగాడి వివరాలు

వీరఘట్టం: హలో.. నేను వీరఘట్టం కానిస్టేబల్‌ను. ఎస్సై గారు హాస్పిటల్‌లో ఉన్నారు. అర్జెంట్‌గా రూ.55 వేలు కావాలి. నా వద్ద క్యాష్ ఉంది. మీరు ఫోన్‌పే చేస్తే క్యాష్ ఇచ్చేస్తానని నమ్మబలికాడో సైబర్ కేటుగాడు. అర్జెంట్ అంటూ పదే పదే ఫోన్ చేయడంతో అతను చెప్పింది నిజమేనని నమ్మిన వీరఘట్టానికి చెందిన ప్రతాప్ అనే వ్యక్తి సోమవారం రూ.28 వేలు ఫోన్‌పే చేశాడు. ఫోన్‌పే కొట్టిన పది నిమిషాల్లో అవతలి వ్యక్తి ఫోన్ స్విచాఫ్ అయ్యింది. దీంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఆరా తీస్తే అటువంటి వ్యక్తి ఇక్కడ ఎవరూ లేరని తేలింది. అంతేకాకుండా ఎస్సై కళాధర్ విధుల్లో ఉన్నారు. దీంతో తాను మోసపోయానని ప్రతాప్‌కు అర్థమైంది. తనకు న్యాయం చేయాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కొంప ముంచిన వాట్సాప్ గ్రూప్..


వీరఘట్టం, పాలకొండ, పార్వతీపురానికి చెందిన 469 వ్యాపారులు,ఇతర ఉద్యోగులు, సామాన్యులు అందరూ కలిసి 'వి.జి.టి.యం నీడ్ మనీ ట్రాన్స్‌ఫర్స్ వీరఘట్టం' అనే వాట్సాప్ గ్రూప్‌లో ఉన్నారు.ఎవరికైనా డబ్బులు కావాలన్నా, ఫోన్ పే కావాలన్నా ఒకరికొకరు పరిచయస్తులు కావడంతో సులువుగా మనీ ట్రాన్స్‌ఫర్ చేసుకుంటూ ఏడాది కాలంగా ఈ గ్రూప్ నడుస్తోంది.ఈ గ్రూప్‌లో మెసేజ్ రావడంతో ఇదే గ్రూపులో ఉన్న ప్రతాప్ అవతల వ్యక్తిని నమ్మి మోసపోయాడు. ఈ వాట్సాప్ గ్రూప్ నా కొంప ముంచిందంటూ లబోదిబోమంటున్నాడు.

స్విచాఫ్ అయిన నంబర్..

ప్రతాప్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు 7569341175 నంబర్ వివరాలు ఆరా తీయగా ఈ నంబర్ మోశ్యా శ్రీరామ్ అనే పేరు మీద ఉంది.అడ్రస్‌ను పరిశీలించగా సన్ ఆఫ్ మోశ్యా బలరాం బేటా, తాజంగి, చింతపల్లి, విశాఖపట్నం–531116 అని ఉంది. ఆ ఫోన్ నంబర్ మాత్రం స్విచాఫ్ వస్తోంది. విజ్ఞత గల వ్యాపారులు ఇటువంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హితవు పలుకుతున్నారు.

జరిగిన విషయం ఇదీ..

వీరఘట్టం బార్నాలవీధి రోడ్డులో ఎరువుల షాపు నిర్వహిస్తున్న లోకేష్ అనే వ్యక్తికి 7569341175 అనే నంబర్ నుంచి సోమవారం ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. వీరఘట్టం పోలీస్‌స్టేషన్ నుంచి కానిస్టేబుల్‌ను అని చెప్పి ఎస్సై హాస్పిటల్‌లో ఉన్నారు. అర్జెంట్‌గా రూ.55వేలు కావాలని అడిగాడు. అయితే తన వద్ద డబ్బులు లేవని, మా ఫ్రెండ్‌ను అడుగుతానని దగ్గరలో ఉన్న స్వీట్ షాప్ యజమాని సంతోష్‌కు లోకేష్ ఫోన్ చేసి కానిస్టేబుల్ అని చెప్పిన వ్యక్తి ఫోన్ నంబర్ ఇచ్చాడు.దీంతో సంతోష్ అనే వ్యక్తి 'వి.జి.టి.యం నీడ్ మనీ ట్రాన్స్‌ఫర్స్ వీరఘట్టం' అనే వాట్సాప్ గ్రూప్‌లో అర్జెంట్‌గా ఓ వ్యక్తికి రూ.55 వేలు కావాలంట..ప్లీజ్ కాంటాక్ట్ అని 7569341175 నంబర్‌ను గ్రూప్‌లో పోస్టు చేశాడు. ఇదే గ్రూపులో ఉన్న ప్రతాప్ అనే వ్యక్తికి క్యాష్ అవసరం ఉండడంతో ఆ ఫోన్ నంబర్‌కు ఫోన్ చేశాడు. తన వద్ద రూ.28 వేలు మాత్రమే ఉన్నాయని, మీరు సంతోష్‌కు క్యాష్ ఇచ్చేయండి మీకు ఫోన్‌పే చేస్తానని చెప్పాడు.దీంతో వారి మధ్య కొంతసేపు ఫోన్ సంభాషణ జరగ్గా అతను వీరఘట్టానికి చెందిన కానిస్టేబుల్ అని నమ్మిన ప్రతాప్ అతని ఫోన్ నంబర్‌కు రూ.28 వేలు ఫోన్ పే చేశాడు. వెంటనే అవతలి వ్యక్తి ఫోన్ నంబర్ స్విచాఫ్ రావడంతో తాను మోసపోయానని ప్రతాప్ గ్రహించి చివరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తనకు న్యాయం చేయాలని మంగళవారం ఫిర్యాదు చేశాడు.



ప్రతాప్ కొట్టిన రూ.28 వేల ఫోన్‌పే రిసీప్ట్

పుష్పాలంకరణలో పైడితల్లి



ప్రత్యేక పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం , కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువ జామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ బకాయి బిల్లులు తక్షణమే చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు

విజయనగరం ఫోర్ట్: ఉపాధి వేతన దారులకు బకాయి ఉన్న 9 నుంచి 13 వారాల ఉపాధి హామీ బకాయి బిల్లులు తక్షణమే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ చట్టం ఉద్దేశానికి నేటి పాలకులు, అధికారులు తూట్లు పొడుస్తున్నారన్నారు. పనులు కావాలన్న వారికి 15 రోజులకు పనులు ఇవ్వాలని, లేని పక్షంలో 16వ రోజు నుంచి కార్మికులకు భృతి చెల్లించాలని చట్టం చెబుతున్నా చాలా గ్రామాల్లో ఇది అమలు కావడం లేదన్నారు. వేతనదారులకు 9 నుంచి 13 వారాల పాటు బిల్లులు చెల్లించకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. రోజురోజుకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజువారీ వేతనం రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు.

సమన్వయంతో శ్రీరామనవమిని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ దాట్ల కీర్తి

- ఆర్డీఓ దాట్ల కీర్తి
- శ్రీరామనవమి ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష



కల్యాణ వేధిక వద్ద ఏర్పాట్ల పరిశీలన

నెల్లిమర్ల రూరల్: ఈ నెల 6న రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో రామతీర్థంలో జరగనున్న శ్రీరామనవమి వేడుకలను అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఆర్డీఓ దాట్ల కీర్తి సూచించారు. ఈ మేరకు మండలంలోని రామతీర్థంలో కల్యాణం ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులు, సిబ్బందితో మంగళవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ఒక్కో శాఖకు చెందిన అధికారితో మాట్లాడి చేస్తున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..స్వామి కల్యాణాన్ని వీక్షించేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కల్యాణ వేదిక చుట్టూ టెంట్లు ఏర్పాటు చేయాలని భక్తులకు మజ్జిగ, నీరు సరఫరా చేయాలని చెప్పారు. ఆలయం వెలుపల, కల్యాణ వేదిక ప్రాంగణం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఫైర్, పోలీస్, దేవాదాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. కల్యాణం అనంతరం స్వామి తలంబ్రాల పంపిణీ ప్రక్రియ ప్రధాన ఘట్టమని, ఆ ప్రక్రియలో ఎటువంటి తోపులాటలు జరగకుండా క్యూలు ఏర్పాటు చేయాలని చెప్పారు. కల్యాణ వేదికపైకి భక్తులు వెళ్లకుండా పోలీసులు చూసుకోవాలని సూచించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, 108, 104, ఫైర్ ఇంజిన్ వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఆటంకం కలగకుండా చూసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం తరఫున మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఈఓ వై శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ సత్యనారాయణ, డీపీఓ వెంకటేశ్వరరావు, డీఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా ఫైర్ అధికారి రాం ప్రకాష్, తహసీల్దార్ సుదర్శనరావు, ఎంపీడీఓ రామకృష్ణరాజు, నాయకులు సువ్వాడ రవిశేఖర్, కంచరాపు రాము, గేదెల రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

వారి క్రమశిక్షణ స్ఫూర్తిదాయకం

- ఆత్మీయ వీడ్కోలు సభలో ఎస్పీ వకుల్ జిందల్



ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందిని సత్కరిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: సుదీర్ఘ కాలం పోలీసుశాఖలో బాధ్యతాయుతంగా ఎంతో క్రమ శిక్షణతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన పోలీస్‌కంట్రోల్ రూమ్ ఎస్సై ఎన్ని సత్యానందరావు, గుర్ల పీఎస్ హెచ్‌సీ ఎ.భాస్కరరావులకు ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్, మాట్లాడుతూ పోలీసుశాఖలో సుదీర్ఘ కాలం మంచి సేవలందించి నేడు ఉద్యోగ విరమణ చేస్తున్న ఎస్సై ఎన్ని సత్యానందరావు, హెడ్ కానిస్టేబుల్ అదపాక భాస్కరరావులకు శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు విధులను నిర్వహించడంలో క్రమశిక్షణ, అంకిత భావంతో పనిచేసి, ఇతర పోలీసు ఉద్యోగులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని ప్రశంసించారు. ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీసు అధికారులకు ఏ సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానని, వారికి అవసరమైన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తానని ఎస్పీ వకుల్ జిందల్ భరోసా కల్పించారు. అనంతరం, ఉద్యోగ విరమణ చేసిన ఎస్సై ఎన్ని సత్యానందరావు దంపతులను, హెడ్ కానిస్టేబుల్ భాస్కరరావు దంపతులను పోలీసుశాఖ తరపున ఎస్పీ వకుల్ జిందల్ శాలువాలు, పూలమాలలు, గిఫ్ట్, సన్మాన పత్రాలతో సత్కరించి, ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) పి.సౌమ్యలత, ఎస్బీ సీఐలు ఏవీ లీలారావు, ఆర్వీఆర్కే చౌదరి, కంట్రోల్ రూమ్ సీఐ వైకుంఠరావు, ఎస్సైలు జగదీశ్వరరావు, శంకర్రావు, పోలీస్ అసోసియేషన్ అడహాక్ సభ్యుడు కె.శ్రీనివాసరావు, కో ఆపరేటివ్ కార్యదర్శి నీలకంఠం నాయుడు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

147 కేజీల గంజాయి స్వాధీనం



నిందితులను చూపిస్తున్న ఎస్పీ, చిత్రంలో బొబ్బిలి డీఎస్పీ భవ్య, సీఐ నారాయణరావు, రామభద్రపురం ఎస్సై ప్రసాదరావు

- పోలీసుల అదుపులో నలుగురు నిందితులు

విజయనగరం క్రైమ్: జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గడిచిన వారం రోజుల్లో భారీ స్థాయిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా 147కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చూపించారు. గంజాయి సరఫరా చేస్తున్న నలుగురు నిందితులను విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. విశాఖ జిల్లా ఆనందపురం మండలానికి చెందిన బోగవిల్లి గోవిందరావు, సాగుపిల్లి అనిల్ కుమార్, బంక రామసురేష్, అంబిడి బాలరాజులు రామభద్రపురం మండలంలోని కొట్టక్కి జంక్షన్ వద్ద గంజాయి విక్రయానికి పాల్పడుతున్నట్లు అందిన పక్కా సమాచారంతో రామభద్రపురం పోలీసులు, ఆ నలుగురు నిందితులను అదుపులోకి ప్రశ్నించడంతో గంజాయి సరఫరా గుట్టు రట్టైందని ఎస్పీ చెప్పారు. దీంతో నిందితుల దగ్గర ఉన్న 147 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

స్మార్ట్ మీటర్ల బిగింపును తిప్పికొట్టాలి



పోస్టర్‌ను ఆవిష్కరించిన సీపీఎం కార్యవర్గ సభ్యులు

విజయనగరం గంటస్తంభం: ప్రజలపై భారాలు వేసేలా స్మార్ట్ మీటర్లను అమర్చుతున్నారని, దీన్ని తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు కోరారు. 'స్మార్ట్ మీటర్ మా ఇంటికి వద్దు' అనే పోస్టర్‌ను మంగళవారం 46వ డివిజన్ ఎల్‌బీజీ నగర్‌లో జిల్లా కమిటీ సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదానీతో చేసుకున్న సెకీ ఒప్పందం వల్ల ప్రజలపై విపరీతమైన భారం పడుతోందని ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ వ్యతిరేకించిందని గుర్తు చేశారు. స్మార్ట్ మీటర్ల పగలగొట్టండి అని పిలుపునిచ్చి ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మాట మార్చి అవే స్మార్ట్ మీటర్ల ప్రతి ఇంటికి బిగించడానికి రంగం సిద్ధం చేయడం దుర్మార్గమన్నారు. ప్రశ్నించడానికే రాజకీయాల్లోకి వచ్చానని అప్పట్లో చెప్పిన పవన్‌కల్యాణ్ నేడు నోరు మెదపకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని, స్మార్ట్‌మీటర్ల విధానం తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరో విద్యుత్ ఉద్యమానికి నాంది పలుకుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, బి.రమణ, రేవరాజు, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

డిప్యుటేషన్ ద్వారా 'డైట్' అధ్యాపక ఖాళీల భర్తీ

- 16, 17వ తేదీల్లో రాత పరీక్ష



యు.మాణిక్యం నాయుడు, డీఈఓ

విజయనగరం అర్బన్: డైట్ కళాశాలలో ఖాళీగా ఉన్న బోధన సిబ్బందిని ఫారిన్ సర్వీస్ నియామక నిబంధనల మేరకు డిప్యుటేషన్ పద్ధతిలో నియామకం చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ ప్రకటించింది. ఈ మేరకు డీఈఓ యు.మాణిక్యం నాయుడు మంగళవారం విడుదల చేసిన షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు ఈ నెల 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. డీఈఓల ద్వారా సంబంధిత ప్రిన్సిపాల్స్‌కు దరఖాస్తులు సమర్పించుకోవాలి. 11 నుంచి 13వ తేదీల మధ్యలో దరఖాస్తుల పరిశీలన జరుగుతుంది. అర్హత పొందిన దరఖాస్తుదారులకు ఈ నెల 16, 17వ తేదీల్లో రాత పరీక్ష, 19వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అర్హులైన వారికి డిప్యుటేషన్ ఉత్తర్వులు ఈ నెల 21వ తేదీన అందజేస్తారు. 22వ తేదీనే విధుల్లో చేరాలని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 'డీఈఓ విజయనగరం' వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

అంగరంగ వైభవంగా పోలమాంబ చండీహోమం



పోలమాంబ అమ్మవారు మూలవిరాట్‌కు పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, గిరిజన ఆరాధ్య దేవత శంబర పోలమాంబ అమ్మవారి 10వ జాతర మహోత్సవాల్లో భాగంగా అంగరంగ వైభవంగా మంగళవారం చండీహోమం కార్యక్రమం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోలమాంబ అమ్మవారి చదురుగుడి, వనంగుడి ఆలయాల్లో కొలువైన పోలమాంబ అమ్మవార్లకు ఈవో వీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేశారు. చదురుగుడి వద్ద 11 హోమగుండాలను ఏర్పాటుచేసి, వేద పండితులు అంపోలు రుద్ర కోటేశ్వర శర్మ, డీఎల్ ప్రసాదరావు, బాలబాబు శర్మ ఆధ్వర్యంలో చండీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు . పూర్ణాహుతి కార్యక్రమంలో గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ నాయుడు, పార్వతీపురం మన్యం జిల్లా దేవాదాయ శాఖ అధికారి ఎస్.రాజారావు, సీనియర్ సహాయకులు శ్రీనివాసరాజు, సర్పంచ్ వెదుళ్ల సింహాచలమమ్మ, ఎంపీటీసీ టి.పోలి నాయుడు, ఉపసర్పంచ్ అల్లు వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు నైదాన తిరుపతిరావు, మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్‌లు పూడి దాలినాయుడు, వసంతల భాస్కరరావు, గంజి కాశినాయుడు, మావుడి మాజీ సర్పంచ్ అక్యాన తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



పోలమాంబ అమ్మవారు



చండీహోమంలో పాల్గొన్న భక్తులు

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹260